క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఆదివారం, విశ్వావసు నామ సంవత్సరం, ఉగాది కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకదశ రుద్రాభిషేకాల్లో 248 మంది, శ్రీ లక్ష్మీగణపతిహోమంలో 52 జంటలు, స్వామివారి స్వామివారి గరిక పూజలో మూడు జంటలు పాల్గొన్నారు. 13మంది భక్తులు స్వామికి ఉండ్రాళ్ల పూజలు జరిపారు. స్వామి వారి సన్నిధిలో ఇరుగురు చిన్నారులకు అక్షరభ్యాసాలు, ఎనిమిది మందికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. స్వామికి నలుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 9800 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాలు ద్వారా రూ.5,87,348లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

వనువులమ్మకు రూ.50 వేల విరాళం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వనువులమ్మ జాతర పురస్కరించుకుని అమ్మవారికి భీమవరానికి చెందిన ఉంగరాల నాగ వెంకట పృథ్వీతేజ-కనకదుర్గ దంపతులు రూ.50 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. విరాళం ఇచ్చిన దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

పురోహితుడికి రూ.50 వేల ఆర్థిక సాయం



పురోహితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

రాజోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న రాజోలు గ్రామానికి చెందిన పురోహితుడు చల్లా శ్యామ్‌కు ఆదివారం రాజోలు ఆర్యవైశ్య సంఘం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది. సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.50 వేలను అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవానీ చేతుల మీదుగా అందజేశారు. పురోహిత్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో పురోహితుడు శ్యామ్ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆర్థిక సాయం అందించి శ్యామ్‌కు అండగా నిలిచారు. సంఘ కార్యదర్శి శ్రీను, కోశాధికారి చలువాది త్రినాథ్, కొత్త శ్రీనివాసరావు, రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ ప్రధాన కార్యదర్శిగా రవివర్మ



ఆలమూరు: మండలంలోని మోదుకూరుకు చెందిన చింతా రవివర్మ జిల్లా టెన్నికాయిట్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పేరం రవీంద్ర, కార్యదర్శి కేఎన్వీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. రవివర్మ మాట్లాడుతూ ఈనెల 25 నుండి 29 వరకు ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన 46వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన పలువురు అత్యుత్తమ ప్రతిభ చూపించారన్నారు. ఈ పోటీల్లో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన లేగా త్రిమూర్తులు, పిల్లి రామారావు జాతీయస్థాయిలో నాలుగో స్థానాన్ని సాధించారన్నారు. ఈ పోటీలకు సంబంధించి టీం మేనేజర్‌గా తాను వ్యవహరించానన్నారు. తన ప్రతిభకు మెచ్చి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అసోసియేషన్ నేతలకు రవివర్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మామిడికుదురులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: ఉగాది పురస్కరించుకుని మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1985-86లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పండుగ సందర్భంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని మురిసి పోయారు. నాటి చిలిపి సంఘటనలను మననం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబ నేపథ్యాల వివరాలను ఒకరితో మరొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. సెల్ఫీలు తీసుకున్నారు. అంతా కలిసి భోజనాలు చేశారు. 30 మంది పూర్వ విద్యార్థులు ఈ అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు.



అయినవిల్లిలో విఘ్నేశ్వరుని ఆలయంలో ఆకట్టుకున్న ఉగాది పుష్పాలంకరణ



చింతలూరులోని నూకాంబిక అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు దీక్షితులు



అప్పనపల్లిలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు



అప్పనపల్లిలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ

షడ్రసోపేతాల మేళవింపే ఉగాది

- ఘనంగా విశ్వావసు నామ సంవత్సర వేడుకలు
- కిటకిటలాడిన దేవాలయాలు
- అలరించిన పంచాంగ పఠనాలు
- ఆకట్టుకున్న కవి సమ్మేళనాలు

అంబాజీపేట: తెలుగు వారికి ప్రీతికరమైన ఉగాది పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి పలు దేవాలయాలు కిటకిటలాడాయి. మహిళలు గ్రామ దేవతలను దర్శించుకుని చలివిడి పానకాలు సమర్పించుకున్నారు. మాచవరంలోని ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాలతో పాటు కొర్లపాటివారిపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ, వనువులమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు చోట్ల పంచాంగ పఠనాలు నిర్వహించారు. పలు వ్యాపార సంస్థల్లో నూతన దస్త్రాలను ప్రారంభించారు. పలు దేవాలయాల్లో ఉగాది పచ్చడ్ని భక్తులకు పంచారు.

బాలాజీ ఆలయంలో..

మామిడికుదురు: తెలుగు వారి మొదటి పండుగ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఆదివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. పలు రకాల బెంగళూరు పుష్పాలు, కోనసీమ కొబ్బరి గెలలు, అరటి గెలలు, యాపిల్, జామ, మామిడి, ద్రాక్ష తదితర రకాల పండ్లతో స్వామి వారి ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. వెంకటేశ్వరస్వామి చిత్రాలతో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీ, భూ సమేతుడైన బాలబాలాజీని దర్శించుకుని అమితానందం పొందారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ఉగాది పచ్చడిని సేవించారు. స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పంచాగ పఠనం వైభవంగా జరిపించారు. భక్తులకు పంచాంగాలు, విసనకర్రలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు.



అయినవిల్లిలో ఆకట్టుకున్న మహాశివుని సెట్

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ఉగాది వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. దీంతో మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయంలో అర్చక స్వామి భైరవభొట్ల సత్య వెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం ఉగాది పర్వదినాన వేడుకలు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకులు ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. ప్రత్యేక అలంకరణ చేసిన ఉత్సవ మూర్తులు సన్నిధిలో ఉగాది వేడుకలు చేశారు. కొత్తపేటకు చెందిన శ్రీశారద కళాక్షేత్ర కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. సుమారు 4 వేల మంది భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఉగాది పురస్కరించుకుని ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. అంతర్వేది దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు.

నూకాంబిక ఆలయంలో..

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, అధికారులు ఆలయానికి విచ్చేసి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేయడంతో తీర్థంలో సందడి నెలకొంది. వేద పండితులు నిర్వహించిన పంచాగం పఠనం విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల తాకిడి విపరీతంగా పెరగడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. అలాగే పోలెసారెలో భాగంగా అనేక మంది భక్తులు బిందెలతో బూరెలను తెచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు, బీజేపీ నేత పాలూరి సత్యానందరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంధిపూడిలో వేంచేసిన రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం విశేషంగా ఆకట్టుకుంది. ఉగాది వేడుకల్లో భాగంగా బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ శ్రీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రముఖ పద్య కవి కాముపరపు మల్లికార్జునరావు రచించిన పద్య కవితలు, సూర్య ఆకుల రచించిన విశ్వావసు విశ్వశాంతి, ఎన్.శిరీష రచించిన చైత్రమా! ఎవరికోసం నీ ఎదురుచూపులు, గొడవర్తి శ్రీనివాసు రచించిన విశ్వశాంతిని రక్షించండి కవితలను రచించిన కవులను ఘనంగా సత్కరించారు.

రాజోలులో..

రాజోలు: విశ్వావసు ఉగాది సంబరాలు ఆదివారం రాజోలులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మానేపల్లి గ్రామానికి చెందిన పండితులు సతీష్ పంచాంగ పఠనం చేశారు. వేడుకల్లో పలు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి ఉగాది పచ్చడి పంచారు. సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవానీ, కార్యదర్శి కొత్త నాగ వెంకట పద్మావతి, కాసు రాణి, నాగరత్నం, సుధ, పట్నాల లక్ష్మి, రాజోలు సబ్ రిజిస్ట్రర్ తలశిల రమ్యశ్రీ పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: విశ్వావసు నామ సంవత్సరమంతా ప్రజలు సుఖ సౌఖ్యాలతో శుభాలతో తుల తూగుతారని పండితులు తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి, ఆలయ పండితుల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. పండితులు దీక్షితులు మాట్లాడుతూ పంచాంగ పఠనం విన్నవారికి, చదివిన వారికి శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా భక్తులకు పంచాంగాలకు పంపిణీ చేసి వేదపండితులను సత్కరించారు.

ఆకట్టుకున్న మహాశివుని ఆకృతి

అయినవిల్లి: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో పుష్పాలతో ఏర్పాటు చేసిన మహాశివుని సెట్ భక్తులను ఆకట్టుకుంది. భక్తులు ఈ సెట్ వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. అలాగే ఆలయ ప్రాంగణం అంతా పుష్పాలు, కొబ్బరికాయలు, వివిధ పండ్లు, కూరగాయలతో సర్వాంగ సుందరంగా ఆలయ అధికారులు అలంకరించారు.

పలువురికి అవార్డులు



ముఖ్యమంత్రి చేతుల మీదుగా కళారత్న అవార్డు తీసుకున్న ప్రతాప్

సఖినేటిపల్లి: మండలానికి చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త కత్తిమండ ప్రతాప్, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే కళారత్న(హంస) అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రభుత్వ ఉగాది వేడుకల్లో కళారత్న అవార్డుతో పాటు, రూ.50 వేల ప్రోత్సాహక నగదు, హంస జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని ప్రతాప్ అందుకున్నారు. వివరాలను ఆయన మీడియాకు చెప్పారు. కళారత్న అవార్డు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

సత్యనారాయణకు కళా భూషణ్

మామిడికుదురు: గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ నగరం గ్రామానికి చెందిన బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణకు కళా భూషణ్ పురస్కారం అందించింది. కళా పరిషత్ 37వ వార్షికోత్సవంలో భాగంగా ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ పురస్కారం అందించారని సత్యనారాయణ ఆదివారం తెలిపారు.



కళాభూషణ్ అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ



ఉగాది పురస్కారం అందుకుంటున్న బీఎస్‌వీఎన్ మూర్తి

అర్చకుడికి ఉగాది పురస్కారం

పి.గన్నవరం: స్థానిక గరుడేశ్వరస్వామి ఆలయ అర్చక స్వామి భైరవభొట్ల సత్యవెంకట నారాయణ మూర్తి శైవాగమ విభాగంలో ఉగాది ప్రతిభా పురస్కారాన్ని అమలాపురంలో జిల్లా దేవదాయ శాఖ అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. ప్రశంసాపత్రంతో పాటు రూ.10,116ల నగదు బహుమతి అందుకున్నారు.

శ్రీరామనవమికి రాట ముహూర్తం

పి.గన్నవరం: స్థానిక మూడు రోడ్ల సెంటర్‌లో సీతారామ వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నవమి పందిరి రాటకు ప్రముఖ పురోహితులు మిర్తిపాటి సూరిబాబు ఆధ్వర్యంలో ముహూర్తం చేశారు. సీతారామ వర్తక సంఘం అధ్యక్షుడు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, ఉపాధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, నల్లా పెదకాపు, రాలింగి కోటేశ్వరరావు, బలభద్ర మోహనరావు, గిడుగు బాబ్జీ, తమ్మన ప్రసాద్, యడ్లపల్లి రాము, నారాయణ, రుద్రా గంగారావు, షణ్ముఖ, అయినవిల్లి దుర్గారావు, తోలేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో విజయాలు సాధించాలి

మలికిపురం: విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ విజయాలు అందుకోవాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మలికిపురంలో పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఉగాది వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. గొల్లపల్లి పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రజల సంప్రదాయ పండుగ ఉగాది అన్నారు. ప్రతి ఏడాదీ ఈ పండుగను ఎంతో సంప్రదాయబద్ధంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రజలంతా కుటుంబ సమేతంగా ఆనందండా ఉండాలని ఆకాంక్షించారు. వేడుకల్లో కారుపర్తి కోటేశ్వరరావు సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాన శంకరరావు, కెఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, పాటి శివకుమార్, అడబాల వీరబ్రహ్మజీరావు, కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, ఈద రవి రెడ్డి, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.



మలికిపురంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మాజీ మంత్రి గొల్లపల్లి, పార్టీ నాయకులు

వైభవంగా అమ్మవార్ల జాతరలు

పి.గన్నవరం: రాజులపాలెంలో వేంచేసిన ముసలమ్మ అమ్మవారి 20వ వార్షిక తీర్థం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు పలువురు దాతలు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ నాయకులు ఆధ్వర్యం వహించారు.



ముసలమ్మ

కొర్లపాటి వారి పాలెంలో..

అంబాజీపేట: ఉగాది రోజున ఏటా నిర్వహించే కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వనువులమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నుంచి అమ్మవారి పసిడి కుండలను సుందరంగా అలంకరించిన పూజఘటాలను నెలకొల్పి మేళతాళాలు, బాణసంచా, యువకుల కేరింతల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయం వద్ద అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన ఆడపడుచులంతా అమ్మవారిని దర్శించుకున్నారు.

ముత్యాలమ్మ తీర్థం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిపాలెం సెంటర్లో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు ఆదివారం ఉగాది పర్వదినాన మొదలయ్యాయి. ఈ మేరకు ఆలయంలో అమ్మవారికి ఉత్సవాల కమిటీ చైర్మన్ దంతులూరి శ్రీనురాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు శ్రీనురాజు అన్నారు. బాబీ, మురళీ, సత్య, శ్రీను పాల్గొన్నారు.


భక్తుల దాహార్తి తీర్చిన చలివేంద్రాలు



కొత్తూరులో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆలమూరు: చింతలూరులో వేంచేసిన నూకాంబికా అమ్మవారి తీర్థోత్సవాలను పురస్కరించుకుని ఉగాది పర్వదినాన దాతలు ఆదివారం విరివిగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలు భక్తుల దాహార్తిని తీర్చాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గోశాల-గోపరంధామం కమిటీ పర్యవేక్షణలోను, గుమ్మిలేరులోని కృష్ణతేజ రైసుమిల్లు ఆవరణలో ప్రముఖ పారిశ్రామికవేత్త వంక సత్యనారాయణ ఆధ్వర్యంలోను మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కొత్తూరు సెంటర్‌లో బాలాజీ గ్రూప్స్ అధినేత జాస్తి వెంకటేశ్వరరావు భారీ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి భక్తులతో పాటు ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. అలాగే చింతలూరులో గౌడ యూత్, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాల్లో మజ్జిగ, బెల్లపు పానకం, మంచినీటిని అందించారు. చింతలూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉగాది పండగను పురస్కరించుకుని భారీ అన్నసమారాధన జరిగింది. నూకాంబిక అమ్మవారి భక్తులు పోతల గౌరీ నాయుడు, యార్లగడ్డ యేసురత్నం బృందం దాతల సహకారంతో అమ్మవారికి తీర్థానికి వచ్చిన సుమారు మూడు వేల మంది భక్తులకు పిండివంటలతో అన్నసమారాధన నిర్వహించారు. అలాగే ఆర్యవైశ్య సత్రంలో సంఘ పెద్దలు అన్నదానం ఏర్పాటు చేశారు.

పోలీసు అధికారులకు ఘన సత్కారం



ఆలమూరులో పోలీసు అధికారులను ఘనంగా సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

ఆలమూరు: గ్రామంలో ఆరుగురు విద్యార్థులు అదృశ్యమైన సంఘటనను త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులకు ఆదివారం ఘన సత్కారం జరిగింది. ఇటీవల స్థానిక ఖండ్రిగపేటలో తప్పిపోయిన విద్యార్థుల కేసును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా తీసుకుని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎం.అశోక్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఒక రోజు గడవముందే ఆచూకీని కనుగొన్నారు. ఆ విద్యార్థులను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన రావులపాలెం రూరల్ సీఐ, ఎస్సైలను ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. కంఠంశెట్టి శ్రీనివాసు, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, సలాది నాగేశ్వరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే

పోలీసుల చాకచక్యంతో ఇంటికి తిరిగి వచ్చిన అదృశ్యమైన విద్యార్థులతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముచ్చటించారు. ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చిన ఆ విద్యార్థుల తల్లిదండ్రులను ఆదివారం కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసి చక్కగా చదువుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు రంజాన్ పర్వదినం



కొత్తపేటలో జామియా మసీదు ప్రార్థనా మందిరం

- ఆదివారం ఇఫ్తార్‌తో ముగిసిన ఉపవాసాలు
- రంజాన్ పండగకు పూర్తయిన ఏర్పాట్లు

కొత్తపేట: పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. షవ్వాల్ నెల ప్రారంభ సూచికగా ఆదివారం సాయంత్రం చంద్రవంక దర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు. సోమవారం ఈద్ ఉల్ ఫితర్ పండగ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాసాలు పాటిస్తూ, నమా, సహర్, ఇఫ్తార్, ఖురాన్ పఠనం, దాన ధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపారు.

పేదలకు చేతనైన సాయం



పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో జన్మధన్యమవుతుంది. రంజాన్ పర్వదినం ముస్లింలకు ఎంతో ప్రధానమైనది. అల్లా దివ్య సందేశాలను ప్రతి ఒక్క ముస్లిం ఆచరించాలి. పండగ పూట ఏ ఒక్కరూ పస్తులు ఉండకూడదు. ఆకలి విలువ తెలియజేసేదే రంజాన్ ఉపవాస దీక్ష. ప్రతి ముస్లిం చుట్టుపక్కల ఉన్న పేదలకు చేతనైన సాయం చేయాలి. తనతో పాటు వారూ సంతోషంగా పండగ చేసుకునేలా దానధర్మాలు చేయాలి.

– షేక్ ఖాజాబాబు, మసీదు ప్రెసిడెంట్, కొత్తపేట

సత్ప్రవర్తనకు మార్గదర్శకం



గడచిన మాసంలో చేసిన ఉపవాస దీక్షలు, సమాజులు, దానాలు సంకల్పసిద్ధిని చేకూరుస్తాయి. రంజాన్ మాసంలో అనుసరించిన నియమ నిష్ఠలు, ప్రత్యేక ప్రార్థనలు మానవాళి సత్ప్రవర్తనకు మార్గ దర్శకంగా దోహదపడతాయి. దివ్య ఖురాన్ పఠనం వల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో జీవిస్తారు, కుల, మత, వర్గ రహితంగా సమాజంలో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది.

– షేక్ గౌస్, మండల ముస్లిం సంఘ నాయకుడు, కొత్తపేట

సర్వం సిద్ధం

ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా జిల్లాలో సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంప్రదాయం ప్రకారం ముస్లింలు ఖర్జూర పండు తిని, నూతన వస్త్రాలు ధరించి, అత్తరు రాసుకుని ప్రార్థనా స్థలానికి చేరుకుంటారు. అక్కడ సామూహిక ఈద్ నమాజ్ చదివి, అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకొంటారు. ప్రార్థనా స్థలానికి అల్లా నామం స్మరిస్తూ ఒక మార్గం నుంచి వెళ్లి, వేరే మార్గం ద్వారా ఇంటికి చేరుకుని సేమియా పాయసం సేవిస్తారు. బంధుమిత్రులకు, ఇరుగుపొరుగు వారికీ సేమియా పంపిణీ చేసి, తమ ఆత్మీయతను చాటుకుంటారు. చిన్న పిల్లలకు ఈద్ కానుకలు బహూకరిస్తారు.